# తల్లి మనసు

"టైమై పోయింది శశీ! వెళ్తున్నాను." అనేసి సైకిల్ బెల్లు మోయించి వెళ్ళిపోయాడు శివరాం. "వచ్చేస్తున్నా నుండండి" అంటోన్నా విన్పించుకోకుండా.

అన్నం వార్పువేసి పొయ్యి అలాగే వదిలేసి గబగబా వీధిగుమ్మం దగ్గరికి వెళ్ళింది శశిరేఖ. ఎదరింటివేపు తీక్షణంగా చూస్తూ నించుంది.

ఎదరింటి వాళ్ళ పిల్లవాణ్ణి గాలిలోకి ఎగరేసి ముద్దు పెట్టుకుంటున్నాడు శివరాం. అలాగే చూసింది శశి.

శివరాం ఆ పిల్లవాడి బుగ్గలు నిమురుతూ నవ్వుతూ ఏదో పల్కరించాడు. మళ్ళా ఓ సారి ముద్దుపెట్టుకుని పక్కనే వున్న వాళ్ళమ్మ చేతికిచ్చి టా టా చెప్తూ సైకిలెక్కి దూసుకు పోయాడు.

గిరుక్కున వెనక్కి తిరిగి లోపలికి వచ్చేసింది శశిరేఖ. డబ్బాలోంచి ఓ గుప్పెడు కందిపప్పుతీసి పొయ్యిమీద పడేసింది.

ఉయ్యాలలో అమాయకంగా నిద్రపోతున్న బిడ్డని చూస్తోంటే ఎంత వద్దనుకున్నా ఓ రకమైన నిట్టూర్పు వెలువడింది. కళ్ళు చెమర్చబోతే రెప్పలల్లార్చి కన్నీటిని

కళ్ళలోనే యింకించుకుంది. ఉయ్యాల తాళ్ళు పట్టుకుని కొడుకు మొహంలోకి తదేకంగా చూస్తూ నించుంది.

ఒక్క పదినిముషాలక్రిందట... శివరాం తల దువ్వుకొంటూ గుమ్మం దగ్గరకువచ్చి అన్నాడు. "అన్నట్టు శశీ! మర్చిపోయాను. పెన్‌లో ఇంకు అయిపోయింది.నిన్నే...కాస్త పోసిపెడుదూ! మళ్ళా నా చేతులకి ఇంకు అవుతుందేమో!"

శశి బాబుని భుజంమీద వేసుకుతిప్పుతోంది. వాడికి నాలుగైదు రోజులనుంచీ ఒంట్లో బాగాలేదు - "కొంచెం వీణ్ణి తీసుకోండి. ఇంకు పోసియిస్తాను." అంటూ వాణ్ణి శివరాంకి అందివ్వబోయింది.

"బాప్ రే!" కెవ్వుమని కేక వేసినంత పనిచేశాడు శివరాం- "చాల్లే! నువ్వు ఇంకు పొయ్యకపోతే మానుగానీ... వాణ్ణిమాత్రం నేనెత్తుకోను. వెధవ చీమిడిముక్కు వాడూను. అధరామృతం కారింది కారినట్టేవుంటుంది. ఇవ్వాళే యిస్త్రీబట్టలు వేసుకున్నానుకూడాను." అంటూ రెండడుగులు వెనక్కి వేశాడు - శశి నవ్వుతూ పైటకొంగుతో కొడుకు ముక్కూ మొహం తుడిచింది - "పోనీ ఇప్పుడు చూడండి. ఎంత నీటుగావున్నాడో!"

"ప్లీజ్ ! ఉయ్యాల్లో వేసేద్దూ ! వాణ్ణినమ్మలేం." అంటూ ప్రాథేయపూర్వకంగా చూశాడు. శశి నవ్వి బాబుని పడుకోబెట్టి ఇంకుపోసి పెన్ను అందించింది. "అన్నం వుడికిపోయిందో ఏమో." అనుకొంటూ వంటగదికేసి వెళ్ళింది.

"టైమైపోతోంది శశీ!" అంటూ హడావుడిగా పరిగెత్తాడు శివరాం.

తీరా శశి వచ్చి చూసేసరికి...కనపడ్డదృశ్యం...శివరాం ఎదరింటి వాళ్ళపిల్లవాణ్ణి గాలిలోకి ఎగరేసి...చేతుల్లోకి అందుకుని...ముద్దులాడి...బుగ్గలునిమిరి...టా టా చెప్పి... ఆలోచించకుండా వుండలేకపోయింది శశి.

అలాంటి దృశ్యం ఇదివరకుకూడా చాలాసార్లు చూసింది. మొదట్లో మొదట్లో కుతూహలంగా చూసింది. "వాళ్ళ పిల్లాడు బావుంటాడుకదూ?" శివరాం అంటే "బాగానేవుంటాడు." అంది మనస్ఫూర్తిగానే.

రెండు మూడు సార్లు ఆ పిల్లవాణ్ణి శివరాం స్వయంగా ఎత్తుకుని ఇంటికి తీసుకువచ్చాడు. "ఇంట్లో తినడానికేమైనా వున్నాయా శశీ?" అని అడిగితే "ఏంవున్నాయి? బెల్లంముక్క పెట్టనా?" అంది నవ్వుతూ.

ఆ మర్నాడే కాబోలు శివరాం బిస్కట్ల పేకెట్ తీసుకొస్తే - ఆశ్చర్యపోయి -

"ఇదేవిఁటి? మనవాడు అప్పుడే బిస్కట్లు తింటాడా?" అంది.

"అబ్బే ! వాళ్ళ బుజ్జికోసం తెచ్చాలే." అని ... బయటికి వెళ్ళేప్పుడు ఆ పేకెట్టుకూడా పట్టుకువెళ్ళాడు శివరాం.

"మనవెధవ తినేసరికి ఇలాంటివి ఎన్ని తెచ్చుకోవాలో!" అంది తనూ వీధిగుమ్మం వరకూవెళ్తూ.

కాని శశి మనస్సు అంత తేటగా ఎంతకాలం వుండగలదు?

శివరాం... పరాయి పిల్లణ్ణి అంత ఆప్యాయతగా ముద్దులుపెట్టుకొంటోంటే... కళ్ళారా చూసేశశి ... ఒకరక

మైన ఆవేదనతో... "ఇది అసూయకాదుగదా?" అని తనను తను ప్రశ్నించుకొంది చాలాసార్లు. పసిబిడ్డని...ఎవరిబిడ్డ కానీ... ముద్దు పెట్టుకున్నంతమాత్రాన తను ఇలా బాధ పడటంలో అర్థం వుందా? తన సంస్కారం యింత సంకుచితమా?ఎన్నో చదివి తెలుసుకోగలిగే తనలో యింత మూర్ఖత్వమా? తన విమర్శలకు తనే తట్టుకోలేక సిగ్గుపడిందికూడా. శివరాంని అపార్థం చేసుకోకూడదన్న ఆలోచన శశిని కాస్త నిశ్చింతగా వుండనిచ్చింది.

కాని...పసిబిడ్డని ప్రేమించటమే అతని తత్వం అయితే ఆ ప్రేమ తనబిడ్డకి ఎంతవరకు దక్కుతోంది? తనబిడ్డమాత్రం పసివాడు కాడా? పైగా అస్వస్థతలతో అర్భకంగా తయారౌతోన్న బిడ్డని ప్రేమించాల్సిన అవసరం ఎక్కువగా లేదా?

శివరాం కొడుకుని ప్రేమించటం లేదని ఆ క్షణంవరకూ అనుకోలేదు శశి. కాని శివరాం ప్రవర్తన ఏ విధంగా సరి పెట్టుకోగలదు? ఆ రోజు... శశి మరొకసారి అదే దృశ్యం చూడటంతో...ఒక నగ్నసత్యం...తన సంస్కారం చాలాపరిమితమనీ...తనహృదయం చాలా స్వార్థపూరితమనీ...బాగా తెలిసివచ్చింది. తనభర్త పరాయి స్త్రీ కన్నబిడ్డని అలా నవ్వుతూ ముద్దులు పెట్టుకొంటోంటే నిష్కల్మషంగా చూసి సహించగలిగేంత మంచిది కాదేమో తను.

ఇన్నాళ్ళూ తను వుపేక్షించింది. చాలాపొరపాటు చేసింది. తన వివేకం వుత్తదే కానీ! తన హృదయం చెడ్డదే కానీ!...శివరాం...పరాయిపిల్లవాణ్ణి అంత యిష్టపడటాన్ని తను సమర్థించదు.

శివరాంకి_కొడుకు వున్నాడు.

శివరాం రక్తాన్ని పంచుకుపుట్టి శివరాంని తండ్రిగా ఎంచుకు పెరుగుతోన్న కొడుకు వున్నాడు-ఎవరే అన్యాయం చేసినా అర్థం చేసుకోలేని పసితనంలో వున్నాడు. శివరాం నుంచి పసిబిడ్డకు లభించే ఏ ప్రేమైనా వాడికే పరిమితం కావాలి. వాణ్ణి చూడగానే శివరాం కన్నుల్లో జ్యోతులు వెల గాలి. వాడికోసమే శివరాం చేతులు ముందుకుసాగాలి. శివరాం నిజమైన కన్నతండ్రిగా తనబిడ్డని ప్రేమించాలి.

*　　*　　*

రోజంతా అదే ధ్యాసగావుంది శశికి.

రాత్రి - భోంచేసి గదిలోకూర్చుని పుస్తకం చదువు కోవటం ప్రారంభించాడు శివరాం.

శశి అన్నం వడ్డించుకునే ప్రయత్నంలో వుంది బాబు నిద్రలో లేచి రాగం అందుకున్నాడు. దానికోసమే ఎదురు చూస్తోన్నట్టు శశి గబగబా వుయ్యాల్లోవాణ్ని లేవదీసి గదిలోకి తీసికెళ్ళి శివరాంకి అందిస్తూ అంది- "కాస్సేపు వీణ్ని ఎత్తు కోండి. నేను అన్నంతిని కంచాలు కడిగి వస్తాను. అన్నట్టు రేపటికి పప్పుకూడా నానబొయ్యాలి."

పుస్తకంలోంచి తలే ఎత్తలేదు శివరాం.

"మిమ్మల్నే, వినిపించటంలేదూ?" రెట్టించింది శశి.

"అబ్బ! ఏమిటి శశీ?" యిబ్బందిగా చూశాడు.

"కాసేపు వీణ్ని ఎత్తుకోమంటున్నాను. నాకు పని వుంది."

"నేను చదువుకుంటున్నాను శశీ! సీరియల్స్ పూర్తి చెయ్యాలిగా?"

"మీరు చదువుకోవటం నాకేం కన్పించటం లేదా? ఏడుస్తున్నాడని తీసుకువచ్చాను. అసలే ఒంట్లో బాగాలేదు."

"ఫర్వాలేదు లెద్దూ! అలా పక్కమీద పడుకోబెట్టు. నేను చూస్తూ వుంటాను."

శశిరేఖ మొహంలో కోపం తాండవించింది. తీక్షణంగా చూస్తూ అంది—"చూస్తూవుంటారా? రొంపతో జ్వరంతో బాధ పడుతూ పసిబిడ్డ ఏడుస్తోంటే చూస్తూవుంటారు కదూ? ఎంత జాలి! కన్నకొడుకు—పరాయి పిల్లవాడిమాత్రం తోచలేదేం?"

అర్థంకానట్టు చూశాడు శివరాం— "అదేమిటి? ఎందుకలా అన్నావు?"

"ఎందుకో అన్నాను. మతిపోయి అన్నాను."

"పరాయిపిల్లవాడెవరు? ఎవర్నెత్తుకున్నాను నేను?"

"లేరు. ఎవ్వరూ లేరు. మీరు ఎవర్నీ ఎత్తుకోవటం లేదు. ఎవ్వర్నీ ముద్దులాడటంలేదు. ఎవ్వర్నీ షికార్లు తిప్పటం లేదు — నేనే అక్కసున్న కొద్దీఅంటున్నాను. వుత్తపుణ్యానికి అంటున్నాను." కోపాన్నంతా వెళ్ళబెట్టేసింది.

"శశీ! వాళ్ళ బుజ్జీని అప్పుడప్పుడూ ఎత్తుకుంటానసే గదూ?"

"అప్పుడప్పుడూ ఏం ఖర్మ? ఎల్లప్పుడూ ఎత్తుకు తిరగ వచ్చునే!"

"నువ్వు మాట్లాడేదేదో తిన్నగా మాట్లాడరాదూ?"

శశికోపంతో రెచ్చిపోతూఅంది. "ఇంకా ఏం తిన్నగా? ఎంతతిన్నగా ? పొద్దుటికి పొద్దుట వీణ్ని ఎత్తుకోమంటే బట్టలు పాడుచేస్తాడని - చొంగకారుస్తాడని- వంకలెట్టి తప్పించు కున్నారు. వస్తున్నానుండమంటున్నా వినిపించుకోకుండా పైపై పోతోందని హడావుడిగా పరిగెత్తారు. తీరా గుమ్మం దాటిం తర్వాత మీరుచేసిందేమిటి? ఆ పిల్లవాణ్ని గాలిలోకి ఎగరేసి బంతులాట ఆడటానికి పైమెక్కుణ్నెంచి వచ్చింది? వాడు మీ బట్టలు పాడుచెయ్యడన్న నమ్మకం ఎలా కుదిరింది?... అలాంటిదృశ్యం నేను ఎన్నిసార్లు చూశానో చూసినప్పుడల్లా నన్ను నేనెంత సమర్ధించుకొంటూవచ్చానో మీకు తెలుసా? మీరు-మీకై మీరు...ఒక్కసారికూడా బాబునిచేతుల్లోకి తీసు కోలేదు. ఎన్నోసార్లు మిమ్మల్ని ప్రాధేయపడి నిష్ఠూరపెట్టి, బలవంతంచేసి అందించాను.ఒక్కసారికూడా వాణ్ని మీరు మన స్ఫూర్తిగా ముద్దుపెట్టుకోలేదు. వాడికేసి ఒక్కక్షణం కూడా రెండుకళ్లూపెట్టుకు చూడలేదు. వాడికి జ్వరంవచ్చినా రొంప పట్టినా-విరోచనాలైనా-అకస్మాత్తుగా చావటానికి సిద్ధమైనా మీరు చలించరు. వాడిగురించి ఏ మంచిచెడ్డలూ మీ మనస్సు కంటవు. తెలుసునాకు - తెలుసు." శశిగొంతు భారమై పోయింది. గాభరాగా లేచాడు శివరాం-"ఛ! శశీ! ఏమిటది? ఎందుకంతకోపం? నేనేమంతకాని పనిచేశాననీ?"

"కాని పని అంటే ఏమిటి?" శశి శివరాం కళ్ళలోకి సూటిగా చూసింది. "పరాయి పిల్లల్ని ముద్దుచేస్తూ కన్నబిడ్డని నిరసించటం కాని పని కాదని చెప్పగలరా? మీ సీరియల్ కథలకోసం జ్వరంతో బాధపడుతోన్న బిడ్డని ఏడిపించటం కానిపని కాదని చెప్పగలరా? ఎందుకు వాడి మీద మీకంత కసి? మీ నుంచి వాడికి ఎలాంటి ప్రేమా అందనివ్వరా?"

శశికళ్లలో నీరు వూరింది.

శివరాంకి చాలాకోపం వచ్చింది—"శశీ! నీకైనువ్వు ఏవేవో వూహించుకుని బాధపడుతున్నావుగానీ ఒక్కటికూడా నిజం కాదు. నేను వాళ్ళ పిల్లాణ్ని ఎత్తుకున్నానని నువ్విన్ని నిష్ఠూరాలాడటం బాగాలేదు—ఆ పిల్లాడు తెల్లగా—బొద్దుగా—వుంగరాలజుత్తూ—అదీ చూడగానే ముద్దు వస్తాడు. వాణ్ని చూస్తే నేనే కాదు. ఎవ్వరైనా చేతుల్లోకి తీసుకోకుండా వుండలేరు."

నిర్ఘాంత పోయినట్టేచూసింది శశి.

గిర్రున వెనక్కి తిరిగి వంటింట్లోకి వెళ్ళిపోయింది.

తెల్లబోయాడు శివరాం. అక్కడే నించున్నాడు చాలాసేపు. నెమ్మదిగా వంటింటిగుమ్మం దగ్గిరకి వెళ్ళి నిలబడ్డాడు. బాబు వుయ్యాల్లో నిద్రపోతున్నాడు శశి తలదించుకుని గబగబా అన్నంతింటోంది.

"శశీ! నీకు కో.ంవచ్చింది కదూ?" అదోమాదిరిగా అడిగాడు శివరాం.

"లేదు" శశి తలఎత్తలేదు-"నేనే పొరపడ్డాను. నిజమే. పిల్లలంతా చూడగానే ముద్దువచ్చేంత అందంగానే వుండాలి. తెల్లగానేఉండాలి లేకపోతే ఎలా ఎత్తుకోగలం? ఎందుకెత్తుకోవాలి? నిజమే, నిజమే. నేను పొరబడ్డాను."

శివరాం కాస్సేపు శశికేసే చూసి...గబగబా వెళ్ళి సీరియల్ కథ మూసిపెట్టి పక్కమీద పడుకున్నాడు.

*　　*　　*

మర్నాడు ఉదయం-బద్ధకంగాలేచి గదిలోంచి బయటికి వచ్చాడు శివరాం. వంటింటి గడపలో చాపమీద పక్క వేసి పడుకోబెట్టిన బాబు చాపకి బారెడుదూరంలో నీళ్ళతడిలోకి కాళ్ళుపెట్టి బోర్లాపడుకున్నాడు. అంతవరకూ శశిరేఖ పప్పు రుబ్బటంలో మునిగి కొడుకు వేపు చూడనేలేదు. శివరాంబైటికి వచ్చినప్పుడే తలతిప్పి చూసింది. టూత్ బ్రష్ ఇవ్వటానికి లేచింది.

వస్తూనే శివరాం కొడుకుని సరిగ్గా పక్కమీద పడుకోబెట్టే వుద్దేశ్యంతో లేవదీయబోయాడు. శశి చటుక్కున వాణ్ని అందుకుని పైటతో కాళ్ళంతా తుడుస్తూ "మీరు తొందరగా మొహం కడుక్కోండి ఇప్పటికే పొద్దెక్కింది." అంటూ టూత్ బ్రష్షూ పేస్టూ అందించింది.

"రాత్రి చాలా సేపటివరకూ నిద్రపట్టలేదు శశీ!"

విని వూరుకుంది శశి.

శివరాం మొహంకడుక్కుని వచ్చి చాపమీద కూర్చున్నాడు కొడుకుదగ్గిర. బాబు బొటనవేలు నోట్లో పెట్టుకుని చూస్తూ పడుకున్నాడు—శివరాం కొడుకుమీద చెయ్యివెయ్య బోతే వారిస్తో అంది.

తను బియ్యం ఏరుతూ కూర్చుంది.

బాబు వున్నట్టుండి బోర్లాపడి నుదురుచాపకి ఒత్తుకుని కేరుమన్నాడు. శివరాం పేపరుపడేసి రెండంగల్లో వచ్చాడు. అప్పటికే శశి కొడుకుని ఒళ్లో పడుకోబెట్టుకుంటూ—"నే నెత్తుకున్నాను లెండి. మీరు పేపరు చదువుకోండి. మళ్లా ఆఫీసు వేళౌతుంది." అంది.

"పోనీ నువ్వు బియ్యం ఏరాలిగా? ఇలా ఇచ్చెయ్. ఎత్తుకుంటాను."

"అబ్బే! వాడికి పాలుకూడా యివ్వాలి. పోనీ బియ్యం ఏరండి కూర్చుని." అంది నవ్వు తెచ్చుకుంటూ.

"నాకు చేతకాదు లేవోయ్." అంటూ మళ్ళా పేపరు అందుకున్నాడు శివరాం.

శశి బాబుని ఒళ్లోనే పడుకోబెట్టుకుని బియ్యం ఏరింది. కూరముక్కలు తరిగింది. దాదాపు ఎత్తుకునే పనులన్నీ చేసింది. శివరాం స్నానంచేసి భోంచేసి ఆఫీసుకు బయల్దేరాడు. శశి ఎప్పట్లా శివరాంవెనక వెళ్ళలేదు. వీధి గుమ్మంకేసి చూడలేదు. సాయంత్రం ఇంటికి వస్తూనే అడిగాడు శివరాం—"బాబుకి జ్వరం తగ్గిందా?"

"బాగానే వుంది."

"ఏమిటి? జ్వరమా?"

బాబు వుయ్యాల్లో నిద్రపోతున్నాడు. లేచినప్పుడల్లా శశే హాజరై వుయ్యాలవూచి వాణ్ని ఎత్తుకు సముదాయించి కిక్కురుమనకుండా జేసి పనులన్నీ చేసుకొంది.

రాత్రి...శివరాం స్నానంచేసి పుస్తకంచదువుకొంటూ కూర్చుంటే "అన్నం వడ్డిస్తాను. రారాదూ?" అంటూ పిలిచింది.

"ఇద్దరం కలిసి భోంచేద్దాంలే వాణ్ని నిద్రపోనీ!" అన్నాడు శివరాం పుస్తకం మూయకుండానే.

"ఇప్పటివరకూ పడుకునే లేచాడు. అప్పుడే నిద్రపోడు. ఫర్వాలేదు. ముందు మీరు తినండి. తర్వాత నేనుతింటాను." అనేసి లోపలికివెళ్ళి అన్నం వడ్డించింది. శివరాం లేచివెళ్లాడు. భోంచేస్తూ చాలా విషయాలు తనకైతనే మాట్లాడాడు. కూరల్ని పొగిడాడు. ఉన్నట్టుండి "ఏం! అంత ముభావంగా వున్నావ్?" అంటూ శశిమొహంలోకి చూశాడు "అబ్బే! ఏంలేదు. మీరేదో చెప్తోంటే వింటున్నాను." అంటూ భుజంమీద నిద్రపోతోన్న కొడుకుని వుయ్యాల్లో వేసింది.

"నువ్వూ అన్నం వడ్డించేసుకోరాదూ?"

"మీ పళ్లెం తీసేసి కూర్చుంటాను"

రెట్టించలేదు శివరాం. చెయ్యి కడుక్కు లేచాడు. నిద్రపోతోన్న కొడుకు కేసి ఓసారిచూసి వక్కపొడి నముల్తూ వీధి గుమ్మంలోకి వెళ్ళాడు. ఎదరింటి దంపతులు కొడుకుని ఆడిస్తూ వీధిలో కుర్చీలు వేసుకుకూర్చున్నారు - ఆ సందు సాయంత్రం అయ్యేసరికి నిర్మానుష్యంగా ప్రశాంతంగా వుంటుంది. భోజ

నాలు చేసి ఆడవాళ్లూ మగవాళ్లూ కాస్సేపు ఆరుబయట కూర్చుని-ఒకళ్లనొకళ్ళు పల్కరించుకుని కావలసినంత గాలి పీల్చుకుని-నిద్రాదేవత ఆవరిస్తోంటే ఇళ్ళలోకి పోవటం పరిపాటే.

శివరాంని చూస్తూ ఎదరింటావిడ కుర్చీలోంచి లేచింది.

"రండి అన్నయ్యగారూ! వదినగారింకా భోంచెయ్య లేదా?" అంటూ పల్కరించింది-

"ఒరేయ్! బుజ్జీ! మామయ్యగారొచ్చార్రా! వెళ్ళు. ఎత్తుకుంటారు." అంటూ చంకలో పిల్లాణ్ని చనువుగా శివరాంకి అందించింది.

శివరాం బుజ్జినిఎత్తుకుని ఒళ్ళో కూర్చోబెట్టుకున్నాడు. ఆవిడ భర్తకేసిచూస్తూ అంది- "మన బుజ్జీ అంటే అన్నయ్యగారికి చాలా యిష్టమండీ! ఈ వెధవని ఎత్తుకోకపోతే ఆయనకు తోచదో యేమిటో అనుకుంటాను." అంటూ నవ్వింది.

శివరాం నెమ్మదిగా లేచాడు. బుజ్జిని వాళ్ళనాన్నకి అందిస్తూ అన్నాడు- "వస్తానండీ! మా వాడికి కొంచెం ఒంట్లో బాగాలేదు. లేస్తాడేమో! వాళ్ళమ్మ అన్నంతింటోంది. వస్తానమ్మా!" అంటూ గబగబా లోపలికి వచ్చేశాడు.

శశి బాబుని భుజంమీద వేసుకు తిప్పుతోంది.

అన్నం తింటూతింటూ లేచినట్టుగా-పళ్ళెంలో మజ్జిగ అన్నం మిగిలే వుంది. శివరాం బాబుకోసం చేతులుజాపుతూ- "ఇలా ఇవ్వు శశీ! నీ భోజనం కానీ" అన్నాడు.

"ఫర్వాలేదు. నిద్రపోయాక తింటాలెండి" అంటూ శశి అన్నం పళ్లెంమీద ఓ ప్లేటు మూత పెట్టింది.

"పోనీ నే తిప్పుతాగా? తొందరగా తెముల్చుకు రారాదూ?"

"మీ దగ్గిర వుండడు. ఒంట్లో బాగాలేదు."

"ఎందుకు వుండడూ? వాడికేం తెలుసూ?" అంటూ చొరవగా కొడుకుని తీసుకోబోతొంటే శశి యివ్వలేదు—
"వద్దులెండి. నేనే నిద్రబుచ్చుతాను. నాకు ఆకలిగా కూడా లేదు. ఇక అన్నం తినను."

"శశీ!" తీక్షణంగా చూశాడు శివరాం— "పొద్దుట నుంచీ చూస్తున్నాను. బాబుకి నాచిటికెన వేలుకూడా అంట నివ్వకుండా చేస్తున్నావు. నేను గ్రహించ లేదనుకున్నావా?"

శశి నిర్లక్ష్యంగా అంది— "మీరు గ్రహిస్తే చాలా సంతోషం. నా ప్రయత్నం కూడా అందుకే."

"అంటే ఏమిటి నీ వుద్దేశ్యం!"

"గుండెల్లో దాచుకు కుళ్ళిపోవటం నా వుద్దేశ్యం కాదు. మీ కిష్టం లేని పని మీరు చెయ్యనేవద్దు."

"బాబుని ఎత్తుకోవటం నా కిష్టంలేదా? ఎవరన్నారు?"

"ఎవరన్నా నేనునమ్మను. ఎవరన్నా నేను వూరుకోను. మీరే అన్నారు. ఇకనుంచి వాణ్ని ఎత్తుకోవద్దని మళ్ళా చెప్తున్నాను."

తీవ్రంగా అన్నాడు శివరాం— "నా కొడుకుని నన్ను ఎత్తుకోవద్దనటానికి నువ్వెవరు మధ్య?"

"మీ కొడుకా?" సంభ్రమంగా అంది శశిరేఖ— "మీరు ఆలోచించే మాట్లాడుతున్నారా? నల్లటినలుపు—పీచు జుట్టు—తెగుళ్ళతో తయారైన ఎముకలపోగు—మీకు చూడగానే

అసహ్యంవేసే వీడు మీ కొడుకా?—మీరు మనస్సుని ఎంత బాధ పెట్టుకుని ఈవిషయాన్నిఒప్పుకున్నారో నేను వూహించ లేననుకున్నారా?"

"శశీ!"

"నేను మిమ్మల్ని తప్పు పట్టటంలేదు. అందమైన—ఆరోగ్యమైన బిడ్డలు కావాలని తల్లిదండ్రులు కోరుకోవటంలో అత్యాశ ఏమీ లేదు. మీ ఆశ ఎంత సహజమైనదైనా నెర వేరేదికాదు. బాబుకి ఎంతమంది తమ్ముళ్ళుపుట్టినా—ఎంతమంది చెల్లెళ్ళు పుట్టినా—వీడికన్నా అందంగావుండరు. వీడికన్నా—తెల్లగా వుండరు. వీడికన్నా ముద్దుగా వుండరు. పరాయివారి బిడ్డల్నిచూసిమాత్రమే సంతృప్తి చెందాల్సిన మీ దౌర్భాగ్యానికి నేనుకూడా ఎంతో విచారిస్తున్నాను.

"మీరు—ఆదిలోనే పెద్ద పొరపాటు చేశారు. మీ బిడ్డలకు తల్లి కాబోయేవ్యక్తిని నిర్ణయించుకునే సమయంలో చాలా ఆలోచనా రహితంగా ప్రవర్తించారు. కన్నతల్లి రూపలావణ్యాలూ—అందచందాలూ—బిడ్డలకి సంక్రమిస్తాయని ఆలోచించలేనంత అవివేకంగా ప్రవర్తించారు." — శశి ధోరణికి విస్తుబోయాడు శివరాం—

"శశీ! నీ అందచందాలను ఎన్నడైనా కించపరిచానా? నిన్ను మనస్ఫూర్తిగా నచ్చికదా పెళ్ళిచేసుకున్నాను. ఎందుకంత బాధ పడుతావు?"

నిస్తేజంగా చూసింది శశి "బాధ కాక ఏముంది? అందమైన బిడ్డల్నికని భర్తకి అందించలేని ఆడదానికి బాధకాక యేం మిగులుతుంది? తండ్రిప్రేమకు నోచుకోలేని బిడ్డలకు

దుఃఖంగాక యేం దక్కుతుంది? మీరు నన్నూ నా అంద చందాలనూ ఎంత విమర్శించినా ఇంత బాధ పడేదాన్ని కాదు. నేను కన్నబిడ్డని–వాడి అందాన్ని–మీరు–హీనంచేస్తోంటే ఎవరో కాదు. సాక్షాత్తూ తండ్రి–" మాట్లాడలేక పోయింది.

తదేకంగా శశిని చూస్తోన్న శివరాం ఒక్క క్షణం ఆగి అన్నాడు.

"శశీ! నిజంగా నేను తెలివి తక్కువగా మాట్లాడాను. బాబుని విమర్శించుకుంటున్నా నన్న జ్ఞానం కూడా లేకుండా యేమో అన్నాను. కాని–వాణ్ని ఎన్నడూ నేను నిర్లక్ష్యం చెయ్యలేదు శశీ! నన్ను నమ్ము."

"అదంతా నేను ఆలోచించలేను." దృఢంగా అంది శశి "మీరు వీడికి తండ్రి. మీనుంచి తండ్రిప్రేమ అన్నివిధాలా వీడికి దక్కాలని కోరుకున్నాను. మీ యిష్టాలూ, మీ అయిష్టాలూ నాకు తెలీవు. మీ వుదాసీనతని, ఎంత దాగివున్నా–బాబుకి తల్లిగా నేను సహించలేను. ఇది మూర్ఖత్వమే అయితే ఇదే నన్ను జీవితమంతా వెన్నాడుతుంది." ఎంత ప్రయత్నించుకున్నా శశి కన్నీళ్ళు ఆగలేదు. చెంపలమీదుగా జారిపడ్డాయి.

శివరాం శశికి దగ్గరగా వెళ్ళి భుజంమీద చెయ్యివేసి కన్నీళ్ళు తుడుస్తూ అన్నాడు–"నన్ను క్షమించు శశీ! నా మూర్ఖత్వం నాకు బాగా అర్థమైంది. బాబు జన్మకి నువ్వొక్కదానివే కారణం కాదు, నేనుకూడా. ఇక నన్నెప్పుడూ యిలా శిక్షించకు శశీ!– యేడీ! బాబుని భుజంమీద వేసుకుంటాను. నువ్వ అన్నం తిను." అంటూ శివరాం కొడుకుని అందుకోంటోంటే శశి వారించలేదు.